క్లుప్తంగా

నేడు శోభాయాత్ర

చిత్తూరు కలెక్టరేట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భవించి 75ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం శోభ యాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ హేమంత్‌చౌదరి పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని పీసీఆర్ పాఠశాల నుంచి కట్టమంచి వద్ద ఉన్న వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

గుడిపాల: స్వయం సహాయక గ్రూపుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వసంతాపురం పంచాయతీలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మహిళా సభ్యులు సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించుకోవాలని సూచించారు. స్త్రీనిధి, బ్యాంకుద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే వడ్డీ భారం తగ్గుతుందని చెప్పారు. ప్రస్తుతం సంఘ సభ్యులకు ప్రభుత్వం పెరటికోళ్ల పెంపకం ప్రవేశపెట్టిందని ఆసక్తి ఉన్న వారికి సబ్సిడీపై పెరటి కోళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అంకమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరిలో ఆదివారం అంకమ్మ ఆలయానికి భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామస్తులు నూతన అంకమ్మ ఆలయాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి సర్పంచ్ మునిరామయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, నాయకులు పత్రా సిద్ధయ్య, రామచంద్రారెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల మరమ్మతు పనులు



పెన్నగడం కాజ్‌వేపై జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కొండచుట్టు తిరునాళ్ల కోసం పలు గ్రామాల్లో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గుడిమల్లం నుంచి కొండచుట్టు ఉత్సవం పెనుమల్లం, పెన్నగడం, పాపానాయుడుపేట, మర్రిమంద, వికృతమాల, ఎండీపుత్తూరు, రాజులకండ్రిగ, కుక్కలగుంట, పాయిల్‌సెంటర్ మీదుగా సాగనుంది. ఈ నేపథ్యంలో గుంతలమయంగా ఉన్న రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. ఆలయంలో నాలుగు గోపురాలు, కైలాసం సెట్టింగ్, ధూర్జటి కళాప్రాంగణం, ఆలయ పరిసరాల్లో తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

చదువుతోనే ఉన్నత స్థితి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: సమాజంలో పేదరికాన్ని దూరం చేసి, ఉన్నత స్థితిని సాధించాలంటే చదువు ఒకటే మార్గమని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో వెంకటగిరి, నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లోని బీసీ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న 143 మంది విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి శత శాతం ఉత్తీర్ణతతోపాటు మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ చంద్రశేఖర్, వార్డన్ రామయ్య, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, అనురాధ, అన్నపూర్ణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవం ఆరంభం

- సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన శివపార్వతులు







యాదమరి: సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై దేవదేవేరులు, బంగారుపాళెం: విశేషాలంకారంలో శ్రీముత్యాలమ్మ

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం మూలస్థానంలో వెలసిన శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి ధ్వజారోహణం ముందు కొలువుదీర్చి వేదమంత్రాలతో వార్షిక బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం నిర్వహించి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ పూజాది కార్యక్రమాలకు కట్టకిందవూరుకు చెందిన అంజిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

సూర్య, చంద్ర ప్రభలపై విహారం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో దేవదేవేరులు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాల్లో పుర వీధుల్లో విహరించారు. ఉదయం దేవతామూర్తులను ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి సూర్య ప్రభ వాహనంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో పుర వీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులైన దేవదేవేరులకు ప్రత్యేకంగా సుగంధ పుష్పాలు, మల్లెపూలతో అలంకరించి చంద్రప్రభ వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రశేఖర శర్మ, సత్యనారాయణ శర్మ, శ్యామసుందర ఆచార్యులు, హేమంత్ ఆచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు. ఈ సూర్య, చంద్ర ప్రభ వాహన సేవలకు యాదమరికి చెందిన పద్మరేఖ, రామాంజనేయులు, చంద్రత్రివేణి ఉభయదారులుగా వ్యవహరించారు.

–బ్రహ్మోత్సవాల్లో నేడు

ఏకాంబరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం దేవతామూర్తులైన శివపార్వతులు ఉదయం హంసవాహనం, రాత్రి వృషభ వాహనంపై ఊరేగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అభిషేకాలు ప్రారంభం

మండలంలోని పెరుమాళ్ల పల్లెలో వెలసిన శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయంలో మండల అభిషేకాలను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో దాతలు నిర్మించిన శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయానికి రెండు రోజుల క్రితం కుంభాభిషేకం నిర్వహించారు. ఆదివారం నుంచి ఆలయంలో మండల అభిషేకాలు ప్రారంభించారు. ఈ పూజలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరైన స్వామివారిని దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాలకు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

బంగారుపాళెం: మండల కేంద్రంలో వెలసిన శ్రీముత్యాలమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీముత్యాలమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీమహాగణపతిపూజ, శుద్ధి పుణ్యాహవాచనము, గణపతిహోమం, సకల దేవతల హోమం, పూర్ణాహుతి, దీపారాధన కార్య క్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు కలశాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు లలిత సహస్రనామార్చన, మహామంగళ హారతి చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. తగ్గువారిపల్లెకు చెందిన ఈశ్వరి, హేమచంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.





బంగారుపాళెం: హోమంలో పాల్గొన్న భక్తులు, యాదమరి: వీరబ్రహ్మంగారి ఆలయంలో పూజలు

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన ఉంటుందని, ప్రజల ఫిర్యాదులు స్పందనలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 –5 గంటల మధ్యలో వినతులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్: 08572232745, వాట్సప్–9849907885 నంబర్లకు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలోనూ..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఈ స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కన్వీనర్ల నియామకం

బంగారుపాళెం/యాదమరి:పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, కో–కన్వీనర్లను పార్టీ కార్యాలయం ప్రకటించింది. పూతలపట్టు మండల కన్వీనర్‌గా నవీన్‌కుమార్, కో–కన్వీనర్లుగా ఉదయ్‌కుమార్, వినాయక, సాయికృష్ణ, పి నవీన్ కుమార్, బంగారుపాళెం కన్వీనర్‌గా చందన్ కుమార్, కో–కన్వీనర్లుగా త్యాగరాజులురెడ్డి, శివకుమార్, దినేష్‌కుమార్, వేణుగోపాల్ నియమితులయ్యారు. యాదమరి కన్వీనర్‌గా గజేంద్రయాదవ్, కో–కన్వీనర్లుగా, వినోద్‌రెడ్డి, హరీష్, గోపి, నిరంజన్, తవణంపల్లె కన్వీనర్‌గా నితిన్‌కుమార్, కో–కన్వీనర్లుగా ప్రశాంత్‌కుమార్, కిరణ్‌కుమార్, నవీన్‌రెడ్డి, బాలప్రసాద్, ఐరాల కన్వీనర్‌గా కిరణ్‌కుమార్, కో–కన్వీనర్లుగా డి.కిరణ్, జ్యోతికుమార్, గుణప్రకాష్, లోకేష్ నియమితులయ్యారు.

వినాయకుని సేవలో చంద్రగిరి ఎమ్మెల్యే



చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి ఉన్నారు.

మైనారిటీలకు అంజుమన్ కమిటీ సన్మానం



అంజుమన్ కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్ : నగరంలో అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మైనారిటీ సన్మానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి హాజరయ్యారు. ఇటీవల జిల్లాఖాజీ కమలుల్లాహురి, అంజుమన్ నిర్వహించిన నమాజ్, ఖురాన్ పోటీల్లో గెలుపొందిన 40 మంది పిల్లలకు వెండిపతకాలతో సన్మానించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రహమతుల్లా, ఉపాధ్యక్షుడు గఫార్‌ఖాన్, కార్యదర్శి మొహియుద్దీన్, సంయుక్త కార్యదర్శి ఫిరోజ్‌అహ్మద్, కమిటీ సభ్యులు అక్రమ్‌అలీఖాన్, ఇర్ఫాన్, జునైద్‌ను సన్మానించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత అబ్దుల్‌గఫార్, ఉత్తమ సేవ కోసం కోఆప్షన్ మెంబర్ ఆను, డాక్టరేట్ గ్రహీత సయ్యద్, చిత్తూరు నుంచి కుస్తీ పతకాల కోసం కృషి చేసిన రెజ్లింగ్ కోచ్ సయ్యద్ రఫిక్‌ను సన్మానించారు. మైనారిటీ సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి తెలిపారు. మైనారిటీలకు డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సభ్యులు జనాబ్‌గని, జనాబ్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మూర్తుల శక్తి.. మూగజీవులకు ముక్తి

శివుడిని పూజిస్తున్న మూగజీవాలు



శ్రీకాళహస్తీశ్వరాలయం దేశంలోని ఇతర శైవాలయాలతో పోలిస్తే ఒకింత భిన్నం. మూగజీవులైన (శ్రీ–కాళ–హస్తులకు) సాలీడు..సర్పరాజం.. ఏనుగు భక్తికి మెచ్చి.. ఆ మూడు జీవులకు శివసాయుజ్యం ప్రసాదించిన ముక్తి ప్రదాత. అందుకే ఇది సద్యోముక్తి క్షేత్రంగా(అడుగిడిన వెంటనే ముక్తిని ప్రసాదించే), భక్తుల పాలిట దక్షిణ కైలాసంగా ఖ్యాతి గాంచింది. అందుకే ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలంటే ముల్లోకాలకు పండుగే. నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పుణ్యక్షేత్రంపై ప్రత్యేక కథనం. – శ్రీకాళహస్తి



ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



ధ్వజస్తంభం



మూగజీవులకు ముక్తి నిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి క్షేత్రం ఖ్యాతి గాంచింది. ఈ వాయులింగేశ్వర క్షేత్రం మహాశివరాత్రికి సన్నద్ధమైంది. దేవస్థానం భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మూగజీవాలకు ముక్తితో శ్రీకాళహస్తి అనే పేరు సార్థకమైంది. కృతయుగంలో సాలెపురుగు (శ్రీ), పాము (కాళ), ఏనుగు (హస్తి)ఒకదానికి తెలియకుండా ఒకటి శివుడ్ని నిత్యం పూజించేవి. శివలింగాన్ని ఎండ వానల నుంచి రక్షించేందుకు సాలె పురుగు గూడు అల్లి పూజించేది. పాము రత్నాలు, ముత్యాలతో.. ఏనుగు తొండంతో నీరు తెచ్చి అభిషేకం చేసి ఫల, పుష్ప, పత్రాలు పెట్టి పూజించేది. అయితే ఎవరో శివుడికి హాని చేసే కార్యక్రమం తలపెడుతున్నారని వేటికవి భయపడుతాయి. ఏనుగుని సంహరించాలని పాము తొండంలో దూరి బాధపెడుతుంది. ఆ బాధను భరించలేక తొండాన్ని బండకు ఢీ కొట్టి ఏనుగు మరణిస్తుంది. ఏనుగు తొండంలో ఉన్న పాము కూడా మృతి చెందుతుంది. శివలింగానికి పైన ఉన్న సాలెపురుగు కూడా మరణిస్తుంది. శివుడు ఈ మూడింటికి ముక్తిని ప్రసాదిస్తాడు. శివైక్యం పొందిన వాటి రూపంలోనే శివలింగం మొత్తం సర్ప శరీరంగా దర్శనమిస్తోంది. పైనుంచి కింది వరకు ఏనుగు దంతాలు, అడుగు భాగంలో సాలెపురుగు ఆకారాన్ని పోలి ఉంటుంది. ఏనుగు దంతాల మధ్యలో భక్తుడైన కన్నప్ప కన్ను కనిపిస్తుంది. అందుకే ఈ క్షేత్రం శ్రీ.కాళహస్తిగా పేరు గాంచింది.

పల్లవించెను నాడు.. పరిమళించేను నేడు

దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని నిర్మించారు. శైవ, స్కంధ, లింగ పురాణాల ప్రకారం బ్రహ్మ శివానుగ్రహంతో కైలాసం నుంచి శ్రీకాళహస్తీశ్వర విగ్రహాన్ని తెచ్చారని, అందువల్ల ఈ కొండకు కైలాసగిరి అని పేరు వచ్చిందంటారు. అర్జునుడు తన తీర్థయాత్రలో ఈ స్థలాన్ని దర్శించి కైలాస నాథీశ్వరున్ని పూజించారు. భరద్వాజ మహర్షి ఇక్కడే తపస్సు చేసి స్వర్ణముఖి నది పవిత్రతను వివరించారని పురాణ కథనం. కైలాసగిరికి దిగువన ఉన్న ఆలయాన్ని మొదట పల్లవరాజులు, తరువాత తొండమాన్ చక్రవర్తి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. చోళులు ప్రధాన ఆలయాన్ని పునరుద్ధరించారు. 11వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు గాలిగోపురాన్ని కట్టించారు. నారాయణవనాన్ని పరిపాలించిన వీరనరసింహ యాదవరాయుడు 12వ శతాబ్దంలో బయటి ప్రాకారాన్ని, ఆలయం నాలుగు మార్గాలను కలుపుతూ నాలుగు గోపురాలను నిర్మించారు. ఆ కాలంలోనే స్వర్ణముఖినదిపైన ఆనకట్ట నిర్మించారు. 1516లో శ్రీకృష్ణదేవరాయలు నూరు స్తంభాల మండపాన్ని, మరో భారీ గాలిగోపురాన్ని కట్టించారు.1529లో అచ్యుతరాయలు శ్రీకాళహస్తిలో పట్టాభిషేకం చేయించుకున్నాడు. 1912లో నట్టుకోట చెట్టియార్లు రూ.9 లక్షలు వెచ్చించి ఆలయం తుది మెరుగులు దిద్దారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న వారికి సకలపాపాలు తొలగి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

పైరు పంటలు.. పల్లె సీమలు కళకళ



మండలంలో ఏపుగా పెరిగిన కందిపంట

గుడిపాల: మూడేళ్ల క్రితం.. వర్షాలు లేక బీటలు మారిన భూములు..నీరింకిపోయి అలంకారప్రాయంగా మారిన బోర్లు...పనులు లేక వలసపోయిన కూలీలు..బోసిపోయిన ఊళ్లు.. ఇప్పుడు కరుణంచిన వరుణుడు.. పాలాలుగా మారిన బీళ్లు.. జలకళ సంతరించుకున్న చెరువులు.. పుష్కలంగా నీరున్న బోర్లు.. ఫలితంగా గ్రామాలు పచ్చని పంటలతో కళకళ లాడుతున్నాయి. పొలం పనుల్లో రైతులు, కూలీలు బిజీబిజీగా ఉన్నారు.

మంచి దిగుబడులు

వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురవడంతో రబీలో సాగుచేసిన పంటలు పచ్చదనంతో కళకళ లాడుతున్నాయి. మండలంలో 27 పంచాయతీల్లో సాగుచేసిన పంటలు మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కంది పూత నిండుగా పట్టింది. పంట ఆశాజనకంగా ఉండడంతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో దిగుబడి కూడా ఆశించిన మేరకు వస్తుందన్న సంతోషంతో రైతులు ఉన్నారు.

రైతు కూలీలకు చేతినిండా పని

కొన్నేళ్లుగా పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతు కూలీలకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి. రైతులకు ఒకేసారి కూలీలు అవసరం కావడంతో రేట్లు పెరిగాయి. రైతు కూలీలకు రెండు, మూడు రోజుల ముందే అడ్వాన్స్ ఇచ్చి ఖాయం చేసుకుంటున్నారు. వేకువ జామునే లేచి పొలంబాట పడుతున్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరగడంతో బోర్లకు నీళ్లు అందుతున్నాయి. మొత్తంగా పల్లెసీమలు పంటపొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి.

జోరుగా వరి కోతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, పల్లమాల, నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని రైతులు జోరుగా వరికోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో రబీలో రైతులు 1,850 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటను ముందుగా సాగు చేయడంతో కోతలు తొందరగా కోస్తున్నారు. ఈ ఏడాది ఎకరాలకు 40 బస్తాలు దిగుబడి వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో ఎకర పంటలకు అన్ని ఖర్చులు పోను రూ. 25 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు.



కల్లివెట్టులో వరి కోత కోస్తున్న యంత్రం